## చిన్నకథ

# కలుషితం

**-రాచపూటి రమేష్**

''సార్, బేడ్ న్యూస్, మన మినీ ఫ్లైట్ రెండు ఇంజన్లూ ఫెయిలైనాయి. ఏ క్షణంలోనైనా విమానం కూలిపోవచ్చు'' పేరాచూట్‌ను సీటు వెనుక నుండి బయటకు తీస్తూ చెప్పాడు పైలట్ ఠాగూర్.

వింటున్న ఎమ్మెల్యే ఏడుకొండలు మొఖం తెల్లగా పాలిపోయింది. ఇన్నాళ్లుగా నానా గడ్డీ కరచి అడ్డమైన స్కాముల్లో బరితెగించి సంపాదించిన నల్లడబ్బు కోట్లకొద్దీ డాలర్లలో మార్చి రెండు సూట్‌కేసుల్లో సర్ది స్విస్ బ్యాంకులో దాయడానికి తాను బయల్దేరిన ముహూర్తం అస్సలు బాగా లేనట్లుంది. ఎవరికీ తెలియకుండా దుబాయ్‌వెళ్లి, అక్కడో స్పెషల్ ఛార్టర్డ్ ఫ్లైట్ తీసుకొని బయల్దేరిన గంట సేపట్లోనే విమానం పెద్దతుఫానులో చిక్కుకొని దారి తెన్నూ లేకుండా పయనించి ఇప్పుడు కూలిపోనుందన్నమాట.

''సార్, సూట్‌కేసులు వదిలేయండి, మరో పేరాచూట్ కట్టుకొని విండోలోంచి దూకెయ్యండి'' సలహా ఇచ్చి పైలట్ పారాచూట్ నడుముకు కట్టుకొని ఫ్లైట్‌లోంచి దూకేశాడు.

చావు ముంచుకొస్తున్నా, డబ్బు మీద మోజు చావలేదు ఏడుకొండలుకు. రెండు సూట్‌కేసులను రెండు చేతుల్తో పట్టుకొన్నాడు. ఆ సరికే పేరాచూట్‌ను తన నడుముకు కట్టుకొని వున్నాడు. దేవుణ్ణి తలచుకుని డోర్ తెరచుకుని కిందకు దూకేశాడు.

''సార్, సార్'' పైలట్ ఠాగూర్ పిలుపుతో స్పృహలోకి వచ్చాడు ఏడుకొండలు. సూట్‌కేసుల బరువుకు పేరాచూట్ మధ్యలోనే తెగిపోవడంతో కిందపడుతూ, ఓ చెట్టుకున్న దట్టమైన కొమ్మల మధ్య ఇరుక్కుపోయాడు ఏడుకొండలు. డబ్బున్న సూట్‌కేసులు ఎక్కడ పడ్డాయో తెలియడం లేదు. పైలట్ ఒంటిపైన చిన్నగాయాలున్నాయి.



''సార్, ఇది ఏ ఆఫ్రికా దేశపు అడవిలాగానో కనిపిస్తూ వుంది. మనమిక్కడ ఎక్కువసేపు వుండడం డేంజర్. పదండి వెళ్లిపోదాం'' భయంగా చుట్టూ చూస్తూ తొందర చేస్తున్నాడు ఠాగూర్.

''నువ్వెళ్లవయ్యా, ఆ సూట్ కేసులు లేనిదే నేను ఎక్కడకూ రాను'' విసుగ్గా అన్నాడు ఏడుకొండలు. ఏడుకొండలు చేసిన స్కాముల గురించి న్యూస్ పేపర్లలో ప్రచురితమైన కథనాల జిరాక్సులు. అతని జేబుల్లో వున్నాయి. అవినీతి డబ్బైనా ఋజువులు లేనిదే డిపాజిట్ చేసుకోమని ఇటీవల కొన్ని స్విస్ బాంకులు ప్రకటించినాయట. టెర్రరిస్టులు డబ్బు బాంకులో వుంచకుండా చేయడానికే ఆ ప్రయత్నం.

ఠాగూర్ కంగారుగా చెప్పాడు. ''సార్, ఇది నరమాంస భక్షకులున్న ప్రాంతంగా కనిపిస్తోంది. నేను వెళ్తున్నాను. మీరూ ఇక్కడ ఎక్కువసేపు వుండకండి'' చెప్పేసి వేగంగా వెళ్లిపోయాడు 'నీ కర్మ' అనుకుంటూ.

ఏడుకొండలు చెట్టు దిగి, చుట్టూ వున్న పొదల్లో సూట్‌కేసుల కోసం వెతకసాగాడు. ఇంతలో 'జింబోరే అంబరే' అనుకుంటూ పులి చర్మాలు కట్టుకొని వున్న భయంకరాకారులు చుట్టు ముట్టారతన్ని. క్షణాల్లో బంధించి తమ గూడేనికి తీసుకొని వెళ్లి తమ నాయకుడి ముందు కట్టేసి నిలబెట్టి ఆనందంగా డాన్సు చేయసాగారు.

''బాగా బలిసినోడుగా వున్నాడు. మనకందరికీ మంచి విందు'' ఇంగ్లీషులో చెప్పాడు, కోడి ఈకల టోపీని కిరీటంలా ధరించిన నరమాంస భక్షకుల నాయకుడు సంతోషంగా.

భయంతో గడగడ వణుకుతున్న ఏడుకొండలకు దొరమాటలు ఇంకా భయాన్ని కలిగించాయి.

''నీ పేరేమిటి? ఏం చేస్తుంటావు'' మళ్లీ ఇంగ్లీషులోనే అడిగాడు దొర ఏడుకొండల్ని.

వచ్చీరాని ఆంగ్లంలో తానొక రాజకీయ నాయకుడినని వివరించాడు ఏడుకొండలు. తన జేబులోని న్యూస్ పేపర్ కటింగ్స్‌ను కూడా దొరకు చూపించాడు.

''వెంటనే అతని కట్లు విప్పి వదిలి పెట్టేయండి'' కంగారుగా చెప్పాడు దొర. ఏడుకొండలుకు నవ్వూ ఏడుపు ఒకేసారి వచ్చాయి. వెళ్లే ముందు బెదురుగా తననెందుకు వదిలి పెట్టారని అడిగాడు నాయకుడిని.

''నీవంటి రాజకీయ నాయకుడికి ఒళ్లంతా కలుషితమే. గతంలో నీలాంటి పొలిటీషియన్ని తిన్న మాకు రకరకాల రోగాలు వచ్చాయి. ఎంత క్లీన్ చేసినా, మీలోని కాలుష్యం పోదు'' చీదరగా చూస్తూ చెప్పాడు దొర.

''బతుకు జీవుడా'' అనుకుంటూ ఏడుకొండలు ఆఫ్రికా అడవుల కడ్డం పడి పరుగు సాగించాడు.

*